క్లుప్తంగా

25 నుంచి ట్యాంకర్లతో నీటి సరఫరా



కైకలూరు: సకాలంలో వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టుల్లో తగినంత నీరు లేకపోవడంతో నియోజకవర్గంలో తీవ్ర తాగునీటి సమస్య ఉత్పన్నమైంది. దీనిపై ఇటీవల జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏలూరు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎస్‌వీవీ సత్యనారాయణ నాలుగు మండలాల ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఈఓపీఆర్డీలు, సెక్రటరీలతో గురువారం సమీక్ష నిర్వహించారు. కైకలూరు మండలం రామవరం, శీతనపల్లి, వేమవరప్పాడు, భుజబలపట్నం, ఆటపాక, కలిదిండి మండలంలో ఆరుతెగలపాడు, కోరుకొల్లు, కలిదిండి, మూలలంక, భాస్కరరావుపేట, మట్టగుంట, మండవల్లి మండలం చావలిపాడు, పెరికేగూడెం, మూలపేట, తక్కెళ్లపాడు, నుచ్చిమిల్లి కాలనీ, ముదినేపల్లి మండలం ప్రొద్దువాక, వైవాక వంటి 18 గ్రామాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నెల 25వ తేదీ నుంచి 15 రోజులు సదరు గ్రామాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఇందుకు రూ.49.92 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాస్త్రి, ఎంపీడీఓలు ఉమామహేశ్వరరావు, దినతేజ్, బేబీ లక్ష్మి, గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నాగబాబు, కృష్ణారావు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కానుకొల్లులో పుస్తకాల పంపిణీ

మండవల్లి: మండలంలోని కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ నాగదాసి థామస్ విచ్చేసి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవ్ కుమార్, ఉపాధ్యాయుడు కురేళ్ల శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

మొవ్వ: మొవ్వ మండల పరిధిలోని నిడుమోలు, కోసూరు, సూరసానిపల్లి, పాలంకిపాడు, చినముత్తేవి, కొండవరం, కూచిపూడి, నర్సన్నపాలెం, కాజ, బార్లపూడి, వేములమడ తదితర గ్రామాల్లోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు హెచ్‌పీసీఎల్ డెప్యూటీ మేనేజర్ రెబ్బా అంబేద్కర్, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ నిర్వాహకులు ఇంటేటి జార్జిముల్లర్, ఇంటేటి హరి, వీర నాగులు పాల్గొన్నారు.

చావలిపాడులో ఉపాధి పనులు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.56 వేలతో మండలంలోని చావలిపాడులో పంట కాలువ అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎంటీఏ ఎన్.నవీన్ తెలిపారు. గురువారం 39 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నట్టు చెప్పారు.

పిల్లలంతా బడిలో ఉండాలి

ముదినేపల్లి రూరల్: బడి ఈడు పిల్లలంతా తప్పనిసరిగా బడులలోనే ఉండాలని ఎంఈఓ కె.నరేష్ కుమార్ అన్నారు. ముదినేపల్లిలో బడికి దూరంగా ఉంటున్న విద్యార్థుల ఇళ్లకు ఎంఈఓ గురువారం వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలకు పంపాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై తప్పనిసరిగా ఉందన్నారు. ప్రభుత్వం అనేక పథకాల ద్వారా పిల్లలను బడులకు రప్పించేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. విద్య ఆవశ్యకతను తెలియజేసి పలువురు పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు జడ్డు నాగాంజనేయులు, విజయదుర్గ పాల్గొన్నారు.

రామోజీరావు సేవలు అజరామరం

పామర్రు: పత్రికా రంగానికి చెరుకూరి రామోజీరావు చేసిన సేవలు అజరామరమని ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ అన్నారు. స్థానిక హితమ్ స్కూల్ ఆవరణంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ నందిపాటి హేమంత్‌రెడ్డి, సిబ్బంది శ్రీలక్ష్మి, తనూజ, రవికుమార్, కేఎస్ఎన్ నాయుడు పాల్గొన్నారు.

డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ప్రవేశాలు

ఎలకుర్రు(పామర్రు): పామర్రు మండలం ఎలకుర్రు గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కళాశాల(ఐడీడీ)లో డైట్‌కు సమానమైన కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ కాశీనాథుని నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని, ఇతర వివరాలకు ఎలకుర్రులోని కళాశాలలో సంప్రదించాలని కోరారు.

నిలిచిన సేవలు.. విద్యార్థులకు అవస్థలు

ముదినేపల్లి రూరల్ : మండలంలోని సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో పలు సేవలు నిలిచిపోయాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సర్వర్లలో మార్పులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో సేవలు నిలిచిపోయాయి. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోవడంతో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

- సీడీపీవో విజయ ఫ్లోరెన్స్
- పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



బాపూజీనగర్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న సీడీపీవో విజయ ఫ్లోరెన్స్

గుడివాడరూరల్: మండలంలోని మోటూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో సీడీపీవో విజయ ఫ్లోరెన్స్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రీప్రైమరీ విద్య పూర్తి చేసుకుని 5 సంవత్సరాలు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో ఎన్.పద్మావతి, సూపర్‌వైజర్ ఎండీ నసీరున్నీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పట్టణంలోని బాపూజీనగర్‌లోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో సీడీపీవో విజయ ఫ్లోరెన్స్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవానీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గరికపర్రులో...

తోట్లవల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి తెలియజేశారు. మండలంలోని గరికపర్రు-1 అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకోవటంతో పాటు ఐదేళ్లు నిండిన వారికి గ్రాడ్యుయేషన్ డే జరిపి పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయురాలు సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్డాడలో...

అడ్డాడ(పామర్రు): మండలంలోని అడ్డాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మూడేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించారు. అంగన్‌వాడీలో ఐదేళ్లు పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించి సర్టిఫికెట్లను వారికి అందించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, మురళీకృష్ణ ట్రస్టు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పామర్రులో...

స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పామర్రు సెక్టారు సూపర్‌వైజర్ సత్యశ్రీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అరండల్ పేట-2, కార్పెంటర్ కాలనీ, కొబ్బరితోట, కంచర్లవానిపురం, బాపూజీపేటలలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

అగినపర్రులో...

పమిడిముక్కల: అగినపర్రు శివారు బొడ్డువానిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. 3 సంవత్సరాలు నిండిన విద్యార్థులను అంగన్‌వాడీలో చేర్పించారు. ప్రీప్రైమరీ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సూపర్‌వైజర్ ఉషా అంగన్‌వాడీల్లో అందించే సేవలపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట మణిరాజు, హెచ్‌ఎం షర్మిల, ఎంఎస్‌కే నాగలక్ష్మి, అగినపర్రు, మామిళ్లపల్లి గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పామర్రు ఎన్టీఆర్ కాలనీలో మన అంగన్‌వాడీ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ సత్యశ్రీ



అగినపర్రు అంగనవాడీ కేంద్రంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం



గరికపర్రులో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాజకీయాల్లో కక్ష సాధింపు తగదు

మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్



గుడివాడటౌన్: రాజకీయాల్లో కక్ష సాధింపులు చేయడం సరైన విధానం కాదని మాజీ మంత్రి కఠారి ఈశ్వర్ కుమార్ అన్నారు. తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేకించి గుడివాడ నియోజకవర్గంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, బీసీ, బడుగు వర్గాలపై కక్ష పూరిత దాడులు చేయడం, బెదిరింపులకు తెగబడటం జరుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన పేదలను, నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని ఫోన్ చేసి బెదిరించడం తగదన్నారు. టీడీపీ నాయకులు రావి వెంకటేశ్వరరావు, తులసి ప్రత్యక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని, అది సరైన విధానం కాదన్నారు. ఒక తెలుగుదేశం నాయకునికి ఐదేళ్ల క్రితం జరిగిన సంఘటనకు ఇప్పుడు క్షమాపణ చెప్పకపోతే అంతు చూస్తామని ఇటీవల ఒక బీసీ యువకుడిని ఫోన్‌లో బెదిరించడం, కొంతమంది నాయకుల ఆస్తుల వివరాలు చెప్పకపోతే అంతు చూస్తామని, వ్యాపారాలు నడవనివ్వమని అనడం ఏమాత్రం సబబు కాదన్నారు. ఇదే విషయాన్ని తాను స్వయంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తీసుకువెళ్లానని, ఒక ప్రజాప్రతినిధిగా అధికార పార్టీ నాయకునిగా ఈ దాడులకు మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపామన్నారు. ఇప్పటికి ఈ దాడులు, బెదిరింపులు మానాలని సూచించామన్నారు. ఇకపై ఈ విధమైన కార్యక్రమాలు చేపడితే ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

పామర్రు: అందరూ సమష్టిగా కృషి చేసి నియోజకవర్గ అభివృద్ధిని సాధిద్దామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పిలుపు నిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఘనంగా రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేస్తున్నామని, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్దామని అన్నారు. పన్నులు కట్టడం బాధ్యతగా ప్రజలు భావించాలని అన్నారు. సర్వే పుస్తకాలను చట్టపరంగా సక్రమంగా చేసి అందిస్తామన్నారు. ప్రజల భూములకు ఎలాంటి అభద్రతా భావంలేని విధంగా విధానాలు తీసుకువస్తామని అన్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఎవరూ ఇబ్బందులు పడకుండా మెరుగైన విధానాలను అమల్లోకి తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటామని అన్నారు. తాగునీటి సమస్యలు, సాగునీటి కాలువలు పూడికతీతపై దృష్టి పెడతామన్నారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను ఎమ్మెల్యే శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సత్కరించారు. తదుపరి ఎమ్మెల్యేను రెవెన్యూ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, మండల తహసీల్దార్ శ్రీపల్లవి, నేతలు జి.లక్ష్మీదాసు, కె.ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, వీఆర్వోలు రామ్‌లక్ష్మణ్, రాము, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ డే సందర్భంగా విశ్రాంత రెవెన్యూ సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలి

గుడివాడరూరల్: ఖరీఫ్ సాగులో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చూడాలని రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మూడు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత నీటి పన్నుల వసూళ్ల నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరారు. గతంలో మాన్యువల్ జరిగినప్పుడు 85 శాతానికి పైగా వసూళ్లు అయ్యేవని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులను కూడా ఆయా శాఖలకు సంబంధించిన విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే మూడు శాఖల మంత్రులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి నిధులు తీసుకువచ్చేలా కృషి చేస్తానని అధికారులకు ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సకాలంలో వర్షాలు పడకపోయినా పట్టిసీమ ద్వారా వచ్చే నీటిని రైతులకు సక్రమంగా అందేలా ముందస్తుగానే అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నేత బూరగడ్డ శ్రీకాంత్, నియోజకవర్గంలోని మూడు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

బాధ్యతాయుత పాలన అందిద్దాం



గుడివాడలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరించిన ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్రాంత రెవెన్యూ అధికారులు, ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి కలిగేలా తాను చేస్తున్న ప్రయత్నంలో రెవెన్యూ ఉద్యోగుల సహకారం అవసరం అన్నారు. త్వరలో పబ్లిక్ గ్రీవెన్స్ ప్రారంభిస్తామన్నారు. ఎవరైనా తమ సమస్యలను గ్రీవెన్స్ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, డెప్యూటీ తహసీల్దార్ లోకరాజు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మొవ్వలో...

మొవ్వ: మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులుగా సుదీర్ఘకాలం సేవలు అందించిన కావూరి భానుమూర్తి(కూచిపూడి), గోవాడ రాంబాబు (బార్లపూడి), కర్ర శ్యామ్ (మొవ్వ)లను శాలువాలు, దండలతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఉపసర్పంచ్ మండవ రామ్మోహనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, నాయకులు తాతినేని పూర్ణచంద్రరావు, మండవ శ్రీకృష్ణ, శీలం బాబురావులతో పాటు ఆర్‌ఐ ఈడే విజయలక్ష్మి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో...

తోట్లవల్లూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి పెనమకూరి జగద్రక్షరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీడీఓ సత్యన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

పెదముత్తేవిలో అక్రమంగా మట్టి తవ్వకాలు



పెదముత్తేవి(మొవ్వ): అధికారంలోకి వచ్చిన నాలుగు రోజులకే టీడీపీ నాయకులు మట్టి తవ్వకాలకు తెర తీశారు. అయినంపూడి డ్రైన్ సమీపంలోని పొలంలోని మట్టిని పొక్లెయిన్ సహాయంతో తవ్వి ట్రాక్టర్లతో గ్రామంలోని పలు ప్రాంతాలకు తరలించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• గుడ్లవల్లేరు ఫార్మసీ విద్యార్థులకు ర్యాంకుల పంట



సాంబయ్య 43వ ర్యాంకు



సువర్ణ 57వ ర్యాంకు



నరసింహనాయుడు 68వ ర్యాంకు

గుడ్లవల్లేరు: పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ పీజీఈసీఈటీ) రాష్ట్ర స్థాయిలో గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలకు చెందిన 40 మంది విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో వంద లోపు ఐదుగురు, వెయ్యి లోపు 18 మంది, రెండు వేల లోపు 17మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ఈ పరీక్షలో అత్యుత్తమంగా కె.సాంబయ్య (43వ ర్యాంకు), సీహెచ్ సువర్ణ (57వ ర్యాంకు), ఎం.నరసింహనాయుడు (68వ ర్యాంకు), ఎం.కుసుమ సిరి (88వ ర్యాంకు), సీహెచ్ రాంపండు(99వ ర్యాంకు) సాధించారని ప్రిన్సిపాల్ చెప్పారు. విజేతలను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

• విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

గుడివాడరూరల్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో గుడివాడ ఎమ్మెల్యేగా వెనిగండ్ల రాము విజయం సాధించడంతో తనను కలసిన అధికారులు, ప్రముఖులను పుష్ప గుచ్ఛాలు, పూలదండలకు బదులుగా నోట్ పుస్తకాలు తీసుకురావాలని ఎమ్మెల్యే రాము కోరారు. ఈ క్రమంలో ఆయనను కలసిన వారు అందజేసిన నోట్ పుస్తకాలను గురువారం పట్టణంలోని ఏజీకే ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము సోదరుడు తులసీతో కలసి సీఐ కె.ఇంద్రశ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు.

• ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనది

గుడ్లవల్లేరు: ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైందని అంగలూరు ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ జిల్లా సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఫస్ట్ ఇయర్ డైట్ ఛాత్రోపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులు వినయ్‌కుమార్, మోహినీకుమారి పాల్గొన్నారు.

• ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.పద్మావతి తెలిపారు. అర్హత పొందిన ఐదుగురు విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గురువారం ఆమె అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ వి.లక్ష్మి, కరస్పాండెంట్ పీవీవీ రామదుర్గ పాల్గొన్నారు.

• మరుగుదొడ్లను కూల్చిన దుండగులు

పామర్రు: స్థానిక గఫార్ సెంటర్‌లో ప్రజల అవసరార్థం కొన్నేళ్ల క్రితం నిర్మించిన మరుగుదొడ్లను బుధవారం రాత్రి కొందరు దుండగులు పగుల కొట్టి కూల్చి వేశారు. ఈ విషయమై పంచాయతీ అధికారులు స్పందించి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, అదే స్థానంలో తిరిగి మూత్ర విసర్జన మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

• ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తోట్లవల్లూరు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జిల్లా అధ్యక్షుడు తాతా సూరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా రాజేష్, మండల అధ్యక్షులు పీబీ రాజా రాయల్, కార్యదర్శి సుమన్, అసోసియేషన్ ప్రతినిధులు వీవీ సాంబశివరావు, పి.పాల్, పీటర్సన్, తదితరులు పాల్గొన్నారు.

• సంప్రదాయ ఆరోగ్య విధానాలు పాటించాలి

గుడివాడటౌన్: భారతదేశ సంప్రదాయ వైద్యవిధానం ఎంతో గొప్పదని డాక్టర్ మాకాల సత్యన్నారాయణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో భాగంగా స్థానిక ఏలూరు రోడ్‌లోని డాక్టర్ గురురాజు హోమియో కళాశాలలో యోగా ఉత్సవాలు నిర్వహించారు. యోగా శక్తిని ఆయన ప్రత్యక్షంగా డెమోలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామనారాయణ, సూపరింటెండెంట్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• అన్నా క్యాంటీన్‌లో ఉచిత భోజనాలు

కై కలూరు: ఉప ముఖ్యమంత్రిగా కొణిదెల పవన్ కల్యాణ్ విధులు చేపట్టిన సందర్భంగా కై కలూరు తాలూకా సెంటర్‌లో అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు గురువారం ఉచితంగా భోజనాలు అందించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో ప్రభుత్వపరంగా అన్నా క్యాంటీన్ నిర్వహించే వరకు దాతల సాయంతో ప్రతి రోజూ భోజన సౌకర్యం కల్పిస్తామని జనసేన నియోజకవర్గ నాయకులు కొల్లి బాబీ, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పూల రాజీ తెలిపారు. ఈ సందర్భంగా భోజన దాతగా వ్యవహరించిన వదర్లపాడు జనసేన నాయకుడు పెరుగు నాగరాజును సత్కరించారు.

• ఉపాధ్యాయునికి సత్కారం

కైకలూరు: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వెలమపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పటాకుల వెంకటేశ్వరరావు దంపతులను గురువారం పాఠశాల వద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు డి.రామారావు, కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు దానం ప్రసాద్ పాల్గొన్నారు.